

'ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు'

నెల్లికుదురు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగు తోటలతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. ఆలేరు గ్రామంలో రైతు రూపిరెడ్డి గోపాల్‌రెడ్డి సాగుచేసిన ఆయిల్ పామ్ తోటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో ఎకరానికి రూ.లక్ష ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, వ్యవసాయ అధికారి యాస్మీన్, నర్మద రాజ్‌కుమార్, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మల్యాల గ్రామంలోనే హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్టికల్చర్ యూనివర్సిటీని మల్యాల నుంచి తరలించేందుకు కొంతమంది యత్నిస్తున్నట్లు తెలిసిందని, ఇక్కడి నుంచి తరలించాలని చూస్తే ప్రజలతో కలసి ఉద్యమిస్తామని చెప్పారు. మల్యాలలో యూనివర్సిటీకి కావాల్సిన స్థలం ఉందని, ఆ గ్రామం పరిశోధనలకు కేరాఫ్‌గా కొనసాగుతుందని తెలిపారు. దేశంలోనే మల్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. స్పందించిన వేం నరేందర్‌రెడ్డి రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడి హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు మల్యాల గ్రామంలో అనువైన స్థలం ఉందని, అక్కడే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మల్యాల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మల్యాల గ్రామస్థులు ఆవుల వెంకన్న, తప్పెట్ల వెంకన్న చిమ్నానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ధీరజ్‌కుమార్

'న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి'

8

గ్రీన్‌సిగ్నల్

చేప పిల్లల పథకానికి సర్కారు అనుమతి

- జిల్లా వ్యాప్తంగా 4.26 కోట్ల చేప పిల్లల పంపిణీ
- సెప్టెంబర్ 1న టెండర్లు ఓపెన్..
- 15లోగా చెరువుల్లో విడుదల
- అదనపు కలెక్టర్ నేతృత్వంలో పర్యవేక్షణ



గత ఏడాది చిల్లంచెర్లలో చేపపిల్లలను విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాంనాయక్ (ఫైల్)

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపపిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 1వ తేదీన టెండర్లు ఓపెన్ చేసి, 15 లోగా చెరువులు, కుంటల్లో వాటిని పోయనున్నారు. ఈ నేపథ్యంలో చేపపిల్లల విడుదల కోసం మత్స్యశాఖ అధికారులు టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 1,229 చెరువుల్లో 4.26 కోట్ల చేపపిల్లలు విడుదల చేయనున్నారు.

జిల్లాలో 1,229 చెరువులు..

మహబూబాబాద్ జిల్లాలో 207 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 15,400 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రత్యక్షంగా 15,400 మందికి ఈ పథకం ఉచిత చేపపిల్లల పంపిణీ ద్వారా లబ్ధిచేకూరనుంది. అంతేకాకుండా పరోక్షకంగా కూడా చేపలపై లాభం చేకూరనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,229 చెరువులు ఉన్నాయి. పెద్ద చెరువులు 284, చిన్న చెరువులు 945 ఉన్నాయి. 35ఎంఎం నుంచి 40ఎంఎం సైజుగల చిన్న చేపపిల్లలు 2.10 కోట్లు చెరువులు, కుంటల్లో వేయనున్నారు. 80 నుంచి 100 ఎంఎం చేపపిల్లలు 2.16 కోట్లు వేయనున్నారు. బొచ్చలు, రవ్వలు, బంగారు తీగ, మృగాల లాంటి చేపపిల్లలు చెరువుల్లో వదలనున్నారు. అయితే సంవత్సరం 1150 చెరువుల్లోనే చేపపిల్లలు వేశారు. 50 శాతం సబ్సిడీ పైనే రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అనుమతించింది. గతేడాది 1.94 కోట్ల పిల్లలు మాత్రమే వేయగా, 19 వేల టన్నుల చేపల దిగుబడి వచ్చింది.



చేపపిల్లల టెండర్లను ఈనెల 18న 'ఆన్‌లైన్'లో పెట్టారు. సెప్టెంబర్ 1న సాయంత్రం 3 గంటల వరకు టెండర్లకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. గతంలో ఆంధ్రా, తెలంగాణ నుంచి కాంట్రాక్టర్లు చేపపిల్లలకు బిడ్ వేయగా.. గతేడాది మాత్రం తెలంగాణకు చెందిన చేపపిల్లల కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న అనుభవం వంటి అర్హతలను ప్రమాణికంగా తీసుకుని టెండర్లు అనుమతిస్తారు. కాంట్రాక్టర్ ఈ టెండర్‌లో పాల్గొనాలంటే ఈఎండీ రూ.9.84 లక్షలు చెల్లించాలి. టెండర్‌ను సెప్టెంబర్ 1న ఓపెన్ చేస్తారు.

అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో..

చేపపిల్లల పథకానికి జిల్లా పర్చేజింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) లెనిన్‌వత్సల్ టొప్పొ వ్యవహరిస్తుండగా సభ్యులుగా మత్స్యశాఖ అధికారితో పాటు జడ్పీ సీఈవో, ఆర్‌అండ్‌బీ ఈఈ, జిల్లా వెటర్నరీ అధికారి, డీఎఫ్‌వో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ నేతృత్వంలోనే టెండర్ల ప్రక్రియ జరుగుతుంది. ఎవరు తక్కువ ధరకు టెండర్ వేస్తే వారికి కాంట్రాక్ట్ దక్కుతుంది.

సెప్టెంబర్ 15 లోపు చేపపిల్లలు వేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

'కళాకారులకు అవకాశం కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రభుత్వ కార్యక్రమంలో కళాకారులకు అవకాశం కల్పించాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి సక్క సైదులు, తెలంగాణ జానపద సకల కళల కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క ఉప్పలయ్య విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో డీపీఆర్వో రాజేంద్రప్రసాద్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా వంద రోజుల అక్షర ఉద్యమంలో భాగంగా వృత్తి కళాకారులకు కలలను ప్రదర్శించే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. గతంలో మద్యపానం, పర్యావరణం, నిరక్షరాస్యత నిర్మూలన, పారిశుధ్యం, గంజాయి, దూమపానం, వరకట్నం లాంటి సాంఘిక అంశాలపై కళారూపాలు, పాటలు, పల్లె సుద్దులు, వీధినాటకాల ప్రదర్శనలిచ్చి, ప్రజలను చైతన్య పరిచిన అనుభవం జిల్లాలోని కళాకారులకు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాకారులు భాగ్యలక్ష్మీ, వెంకన్న, శ్రావణి, సురేందర్, నాగేష్, శ్రీనివాస్ , రామకృష్ణ పాల్గొన్నారు.

'న్యూ డెమోక్రసీ నుంచి పెద్ద చంద్రన్నను బహిష్కరిస్తున్నాం'

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి పెద్ద చంద్రన్నను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు అశోకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పేరిట మహబూబాబాద్‌జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి గురువారం పంపిన ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. పెద్ద చంద్రన్న అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నందున పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నిర్మాణ సూత్రాలనుఉల్లంఘిస్తూ విప్లవేతర పనులకు పాల్పడుతూ పార్టీలో నిజమైన కార్యకర్తలను, నాయకులను దూరం పెడుతూ, ప్రతిఘటన పోరాటానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పెద్ద చంద్రన్నను కేంద్ర కమిటీ కార్యదర్శి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. చంద్రన్న చేస్తున్న ప్రైవేట్ వ్యవహారాలను ప్రశ్నించిన నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా, మానసికంగా అనేక విధాలుగా హింసించేవాడని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మండల, జిల్లా, రాష్ట్ర, కేంద్ర కమిటీ నాయకులు చంద్రన్న అనుసరిస్తున్న పార్టీ నిర్మాణ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, ఇతర పార్టీలలోకి వెళ్లారని..అయినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని చెప్పారు.

చంద్రన్న నాయకులను, కార్యకర్తలను అతని అవసరాల కోసం వాడుకోవడం తప్ప, ఏనాడు కూడా వాళ్లను పట్టించుకోలేదని ఆరోపించారు. అశోకన్నను బహిష్కరించే హక్కు చంద్రన్నకు లేదని తెలంగాణలో పార్టీ శ్రేణులంతా అశోకన్న వెనకాలే ఉన్నారని తెలిపారు. ప్రతీ ఘటన పోరాట ముసుగు తగిలించుకుని అక్రమాలకు పాల్పడుతున్న చంద్రన్నను విప్లవ ఉద్యమం నుంచి వెలివేయాలని విప్లవ శ్రేణులను, ప్రజలను, ప్రజాస్వామిక వాదులకు విజ్ఞప్తి చేశారు.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం గణేష్ ఉత్సవాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పక్కాగా చర్యలు తీసుకోవడంతో పాటు మండలపాల ఏర్పాటు, విగ్రహాల ఎత్తు తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. ఉత్సవవ నిర్వహణ కమిటీలతో ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేసి, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకునేలా కృషి చేయాలని సూచించారు. మండల పాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద మత్స్యశాఖ ద్వారా గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్, మునిసిపల్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, వైద్య, విద్యుత్, మత్స్య, అగ్నిమాపక, రవాణా, ఎక్సైజ్, నీటి పారుదల, రెవెన్యూ తదితర అన్ని శాఖలకు కేటాయించిన విధంగా పకడ్బందీ చర్యలు తీసుకుని గణేష్ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.అనిల్‌కుమార్, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



అధికారులతో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

నర్సింహులపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ ప్రభుత్వ పాలన రైతులకు స్వర్ణయుగం లాంటిదని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు పడుతున్న తిప్పలు చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరుతనానికి రైతులు ఆగం అవుతున్నారని, వ్యవసాయ పనులు మానుకొని, తిండి తిప్పలు లేకుండా యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారన్నారు. గత కొద్ది రోజులుగా యూరియా కోసం రైతులు కడుపులు మాడ్చుకుని రైతుల రోడ్లపైకి వస్తున్న వారిపట్ల కనీసం అవగాహన, సోయి ముఖ్యమంత్రికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈనాటికి రాష్ట్రంలో ఏ ఒక్క రైతు సంతోషంగా లేడని తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు యూరియా కష్టాలు లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ లీడర్లు శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, హోలీ నాయక్, రేఖ శ్రీను పాల్గొన్నారు.



యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

● మరిపెడ హైవేపై రాస్తారోకో ● కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



రైతు ఆగ్రోస్ కేంద్రం దగ్గర మెట్లపై దొర్లి కింద పడడంతో తలకు గాయపడిన రైతు అజ్మీరా లక్కా



మరిపెడ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మరిపెడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పడరాని పాట్లు పడుతున్నారు. దుకాణాల ఎదుట తెల్లవారే సరికే బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో గురువారం యూరియా కోసం మరిపెడ మండల రైతులు తెల్లారే సరికే స్థానిక విశ్రాంతి భవనం దగ్గర ఎన్‌హెచ్‌పై ధర్నాకు దిగారు. చిల్లంచర్ల రెవెన్యూ పరిధి మల్లమ్మకుంట తండాకు చెందిన రెతు అజ్మీరా లక్కా అరుగు మెట్లపై నుంచి కిందపడగా తలకు గాయపడ్డారు. రైతుల ధర్నాతో మరిపెడలోని 365, 563 జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తన పోలీసు బలగాలతో అక్కడికి చేరుకొని రైతులను శాంతపరిచే విధంగా అన్ని ప్రయత్నాలు చేశారు. రైతులందరు ముక్తకంఠంతో యూరియా ఇస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని ఖరాకండిగా చెప్పారు. కాగా, రైతు ఆగ్రోస్ కేంద్రం యజమానిని షాపుకు రప్పించి నిల్వ ఉన్న యూరియాను అక్కడే ఉండి కొందరి రైతులకు పంపిణీ చేయించారు. సగానికి పైగా రైతులకు యూరియా దొరకపోవడంతో రైతులు మళ్లీ ధర్నాకు సిద్ధపడ్డారు. ఎస్సై పరిస్థితి గమనించి మరిపెడ మండల వ్యవసాయ అధికారి వీరాసింగ్‌ను అక్కడికి పిలిపించి రైతులతో మాట్లాడించారు. రైతులందరికి సాయంత్రంలోపు యూరియా ఇస్తామని ఏవో చెప్పడంతో రైతులు శాంతించారు.

మనిషికి ఒక్క బస్తా నిబంధనే.. ఆ రైతుకు శాపం

వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుకు ఒక్క బస్తా నిబంధన అమలు చేస్తుండడంతో గురువారం మరిపెడ మండలం చిల్లంచర్ల మల్లమ్మకుంటతండా రైతు అజ్మీరా లక్కా తలకు బలమైన గాయం తగిలింది. రెండు, మూడు ఎకరాలున్న రెతులు తమ ఇంటిల్లిపాదులను సైతం యూరియా కోసం లైన్లో నిలబెడుతున్నారు. మల్లమ్మకుంటతండాకు చెందిన అజ్మీరా లక్కాకు రెండెకరాల వ్యవసాయం ఉంది. రెండు యూరియా బస్తాల కోసం లక్కాభార్య విజయ పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న భర్తను సైతం మరిపెడలో యూరియా బస్తాలు ఇస్తారని తీసుకొని వచ్చింది. రైతు ధర్నా అనంతరం రైతు ఆగ్రోస్ కేంద్రం దగ్గర యూరియా బస్తాలు పంపిణీ చేస్తుండడంతో భార్య భర్తలు లైన్లో నిలబడ్డారు. ఒక్కేసారి మంది ఒకరిపై ఒకరు తోసుకోగా లక్కా అరుగు మెట్లపై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయం తగిలింది. ఎస్సై సతీశ్ తన సిబ్బందితో మరిపెడ పీహెచ్‌సీ క్షతగాత్రుడిని తరలించి చికిత్స చేయించారు.

● కురవి : కురవిలోని ఆంధ్రాబ్యాంక్ సొసైటీ వద్ద యూరియా కోసం (మిగతా 8లో..)

యూరియా కోసం కేంద్రమంత్రికి రవిచంద్ర వినతి


ఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డాకు వినతిపత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఇనుగుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి యూరియా సరఫరా చేయాలని కోరుతూ ఢిల్లీలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ.నడ్డాకు ఇనుగుర్తికి చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కేఆర్.సురేశ్‌రెడ్డితో కలిసి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగుకు సరిపోయే కోటాను వెంటనే సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగుల నేతలు


కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఉద్యోగుల సంఘం నేతలు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మను తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ సహా సంఘం నేతలు కలిసి మొక్కను బహూకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధి గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ గురువారం సందర్శించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి భారీ వర్షం కురిసినప్పుడల్లా వరదనీరు కేంద్రం లోకి వెళ్లడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సీడీపీవో రాధికతో కలిసి సబ్ కలెక్టర్ పరిశీ లించారు. రోడ్డు ఎత్తుగా ఉంటడం, కేంద్రం చుట్టూ నీళ్ల ఉండటాన్ని ఆయన గమనించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పీఆర్ డీఈ సాయిలుకు సూచించారు. శాశ్వత పరిష్కారం కోసం దర్వాజాను తీసి ఎత్తుగా పెంచి, ఫ్లోరింగ్‌ను తీసేసి మరింత పైకి చేయాలని సీడీపీవో రాధిక, టీచర్ సువర్ణ కోరారు. వరదనీరు సక్రమంగా వెళ్లిపోవడానికి డ్రెయినేజీ నిర్మాణం చేయాలని గ్రామస్థులు కోరగా ఎస్టిమేషన్లు చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. సెంటర్ చుట్టూ నీళ్ల నిలవకుండా మొరం పోయించాలని జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ సతీష్, ఏడబ్ల్యూటీ సువర్ణ ఉన్నారు.

వరద మిగిల్చిన గాయం

- సుమారు 300 ఎకరాల్లో నీటమునిగిన పత్తి పంట
- కొన్ని చోట్ల ఇంకా నీటిలోనే పంట చేలు


కొత్తపేట శివారులో బ్యాక్‌వాటర్‌లోనే ఉన్న పత్తిచేను


బ్యాక్‌వాటర్ ప్రభావంతో దెబ్బతిన్న పత్తిచేను

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదారమ్మ ఉగ్రరూపానికి రైతన్నలు విలవిల్లాడుతున్నారు. వందల ఎకరాల్లో పంటలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో సుమారు 200 ఎకరాలు, పలిమెల మండలంలో సుమారు 100 ఎకరాల్లో పంటలు ముంపుకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కొత్తపేట, మహదేవపూర్ శివారుతో పాటు బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి శివార్లలో పంట నష్టం అధికంగా ఉంది. ప్రాణహిత, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగులు, ఇతర పిల్ల కాల్వల ద్వారా బ్యాక్‌వాటర్ భారీగా వచ్చింది. దీంతో మొక్క, పూత దశలో ఉన్న పత్తిచేలు పూర్తిగా నీట మునిగాయి. గురువారం గోదావరి ప్రవాహం కాస్త నెమ్మదించడంతో వరద నుంచి తేరుకున్నప్పటికీ సుమారు రోజంతా నీటిలోనే ఉండటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పత్తిచేలు వాలిపోగా, మరి కొన్నిచోట్ల చెట్లన్నీ ఎండిపోయాయి. ఇంకొన్నిచోట్ల పంటచేలు బ్యాక్‌వాటర్‌లోనే మగ్గుతున్నాయి. వేలల్లో పెట్టుబడిపెట్టి సాగు చేసిన పంట ఆదిలోనే అంతం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు. కాగా, బ్యాక్‌వాటర్‌తో పత్తిలాంటి పంటలు కొంత వరకు తిరిగి యథాస్థితికి వస్తాయని, ముంపుకు గురైన వరి పంటకు ఏ మందులు పిచికారీ చేయాలో సూచిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరద ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ముంపునకు గురైన పంటలు ఏమేర దెబ్బతిన్నాయో క్షేత్రస్థాయి పరిశీలించిన తర్వాతే నష్టం అంచనా వేయొచ్చని అంటున్నారు.

'యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు'

- కాట్రపల్లిలో ఎరువుల దుకాణం తనిఖీ చేసిన కలెక్టర్


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కేసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు డీలర్లు యూరియాను అక్రమంగా నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం చేస్తే చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. కేసముద్రం మండలంలోని కాట్రపల్లిలో కావ్య ఏజెన్సీస్ ప్రైవేటు డీలరుకు 110 బస్తాల యూరియా సరఫరా కాగా, ఉదయం వ్యవసాయాధికారులు రైతులకు టోకెన్లు జారీ చేసి బస్తాలను పంపిణీ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సదరు ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోఎస్ యంత్రం, ఆధార్ కార్డు ద్వారానే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. ప్రతీ డీలరు తమ ఎరువుల నిల్వల వివరాలను ప్రతీ రోజు ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారికి సమాచారం అందించాలని, వ్యవసాయాధికారుల సమక్షంలోనే ఎరువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఇంగ్లీష్ బోధన నడుస్తుండగా ఓ విద్యార్థినితో కలెక్టర్ పాఠం చదవమనగా అనర్గళంగా చదవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిది, తొమ్మిదో తరగతుల్లో విద్యార్థులను ప్రశ్నించి వారి విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. ఇదే ఆవరణలోని పాలిటెక్నిక్ కళాశాల తరగతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, తహసీల్దార్ వివేక్, ఏవో బి.వెంకన్న ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగుటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, బాలికల కళాశాలలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించగా డీఎంహెచ్‌వో పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, తద్వారా మంచి ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాల న్నారు. అనంతరం పాఠశాలలోని ఆహార పదార్థాలు, కూరగాయల నిల్వలను, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది నవ్య, రాజమణి, రవి, నర్సమ్మ, విద్యా శాఖ సిబ్బంది నర్మదాబాయి, స్వాతి, సంపత్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రవి మృతదేహం

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పెళ్లికాకుండా ఒంటరితనం, అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. జగన్నాయకులగూడెంనకు చెందిన ఈసం రవి (35)కు పెళ్లికాకపోవడంతో పాటు అనారోగ్యం తోడైంది. ఈ కారణాలతో జీవితంపై విరక్తి చెందడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఈసం రవి సోదరుడు నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ఇనుగుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం కోతులు దాడి చేయడంతో కందునూరి మల్లికాంబ తీవ్రంగా గాయపడ్డారు. ఇంటివద్ద పనిచేసుకుంటుండగా 20 నుంచి 30 కోతులు ఆమెపై పడి కరిచాయి. దీంతో ఆమె చేయి విరగగా కాలిపై కోతులు కరవడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలోని మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. కోతులను నివారించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా బస్తాల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా మహబూబాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం లక్ష్మీపురానికి చెందిన ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురానికి చెందిన అజ్మీర బిచ్యానాయక్ కురవి మండలం చింతపల్లి గ్రామంకు యూరియా బస్తాల కోసం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి లక్ష్మీపురంకు వస్తుండగా మహబూబాబాద్ శివారులో నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో బిచ్యానాయక్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

శాంతిస్తున్న గోదావరి

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నెమ్మదిగా శాంతిస్తోంది. బుధవారం 10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గురువారం భారీగా తగ్గింది. ప్రస్తుతం బ్యారేజీలోకి 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 7.8 మీటర్లు నమోదైంది.

పాల్కురికి స్మృతివనంలో సౌకర్యాలు కల్పిస్తాం

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


పాలకుర్తిలో స్మృతి వనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పాలకుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పాలకుర్తిలోని పాల్కురికి సోమనాథ స్మృతి వనాన్ని అభివృద్ధి పరుస్తామని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. స్మృతివనం పరిసరాలు అధ్వానంగా మారడంపై 'సోమనాథా.. మన్నించు..' పేరిట గత నెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కలెక్టర్, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశానుసారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి స్మృతివనం అభివృద్ధిపై అంచనాకు వచ్చారు. ఈ మేరకు గురువారం స్మృతివాన్ని కలెక్టర్ పరిశీలించారు. పర్యవేక్షణ లేక స్మృతివనంలోకి ఆకతాయిలు వస్తున్నారని, మద్యం, అసాంఘీక కార్యకలాపాలు చేపడుతున్నారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఫర్నిచర్, కిటికీల ధ్వంసం, పరిసరాలు అధ్వానంగా మారడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని, తాగునీటి, విద్యుత్ సౌకర్యం, ఎల్ఈడీ హైమాస్ట్ లైట్లు, తాత్కాలిక వాచ్‌మెన్, స్మృతివనం సమీపంలో క్యాంటీన్ ఏర్పాటు, చిన్నపిల్లల సౌకర్యార్థం క్రీడా సామగ్రి, గ్రీనరీ ఏర్పాటుకు కలెక్టర్ నిర్ణయించారు. రాత్రిపూట పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని పోలీసులను ఆదేశించారు.

స్మృతివనం బాధ్యతలను డీఆర్డీవో వసంతకు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పాలకుర్తి పుణ్యక్షేత్రానికి ప్రత్యేక చరిత్ర ఉందని ఆధ్యాత్మిక క్షేత్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాలకుర్తితో పాటు వల్మిడి, బమ్మెర ఆధ్యాత్మిక ఆలయాలను అభివృద్ధి పరుస్తామని వెల్లడించారు. ఆయన వెంట డీపీవో ఎన్.స్వరూప, డీఆర్డీవో పీడీ వసంత, ఏపీడీ నూరోద్దీన్, పీఆర్ డీఈ రామలింగాచారి, ఎంపీడీవో రీందర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ ఉన్నారు.

ప్రజా ప్రభుత్వం కాదు

ప్రజలను ముంచే ప్రభుత్వం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజం


దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు

కొడకండ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇది ప్రజా ప్రభుత్వం కాదని, ప్రజలను ముంచే ప్రభుత్వమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో దయాకర్ సమక్షంలో 500 మంది వివిధ గ్రామాల నుంచి పార్టీ ముఖ్య నాయకులు గులాబీ పార్టీలో చేరారు. కొడకండ్ల మండల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరిగి మాజీ మంత్రి దయాకర్‌రావు సమక్షంలో సొంత గూటికి చేరుకున్నారు. దయాకర్ మాట్లాడుతూ 420 హామీలను ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి ఎంతో జరిగిందని, కాంగ్రెస్ హయాంలో ఒక్క పని కూడా జరగడంలేదన్నారు. సీజన్ రాకముందే యూరియా, డీఏపీలను తాము నిల్వ ఉంచామని, ఇప్పుడు యూరియా బస్తాల కోసం చెప్పుల లైన్లు, రోడ్లపై పడిగాపులు కాస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు సింధి రామోజీ, మాజీ ఎంపీపీ జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెరం రాములు పాల్గొన్నారు.

భీమునిపాదంనకు రాకపోకల పునరుద్ధరణ


భీమునిపాదంలో జాలువారుతున్న వాటర్‌ఫాల్స్

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచలోని భీమునిపాదం జలపాతాన్ని పర్యాటకులు వీక్షించేందుకు రాకపోకలను పునరుద్ధరించినట్లు గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్ గురువారం తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భీమునిపాదం జలపాతానికి వరద ఉధృతి పెరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత వారం రోజులుగా రాకపోకలను నిలిపివేసినట్లు చెప్పారు. గురువారం నుంచి రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

హేమాచల క్షేత్రం ఈవోగా మహేష్

మంగపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈవో)గా మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ దేవాలయానికి ఎనిమిదేళ్లుగా విధులు నిర్వర్తించిన శ్రవణం సత్య నారాయణను దేవాదాయ శాఖ వరంగల్‌లోని మెట్టుగుట్ట ఈవోగా బదిలీ చేసింది. భూపాలపల్లిలోని హనుమాన్ టెంపుల్ ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్. మహేష్‌ను మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఇన్‌చార్జ్ ఈవోగా బదిలీ చేశారు. ఈ మేరకు సత్యనారాయణ వద్ద నుంచి మహేష్ నూతన బాధ్యతలను స్వీకరించారు. భూపాలపల్లి హనుమాన్ ఆలయంలో ఈవోగా కొనసాగుతూనే మల్లూరు క్షేత్రానికి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సత్యనారాయణకు వీడ్కోలు కార్యక్రమాన్ని అర్చక, ఉద్యోగులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఈవో మహేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అర్చకులు, ఉద్యోగులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజ్

వృద్ధాప్యంలో ఉన్న వారిని గౌరవించాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజ్

కృష్ణకాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న వారిని గౌరవించడం మన సంప్రదాయమని భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.నాగరాజ్ అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృద్ధుల చట్టం, న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే వారికి చట్టబద్ధంగా అందించాల్సిన ఉచిత సహాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసా చారి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7660	5300
మక్కలు	2051	1521
కందులు	5883	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6000	3450
పల్లికాయ (పచ్చిది)	5020	1575
పసుపు (కాడి)	10666	9534
పసుపు (గోల)	10259	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	14400	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

శాస్త్ర, సాంకేతిక
ఫలాలు అందరికీ అందాలి



- దేశాభివృద్ధిలో సైన్స్ కీలకం
- తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు
- కేయూలో ముగిసిన సైన్స్ కాంగ్రెస్ సదస్సు
- వివిధ విభాగాల్లో విజేతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు

విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ మోహన్‌రావు తదితరులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ ఒక్కరికి శాస్త్ర, సాంకేతిక ఫలాలు అందాలని, దేశాభివృద్ధిలో సైన్స్ కీలకమని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు, హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.మోహర్‌రావు అకాంక్షించారు. మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, టెక్నికల్స్ సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కేయూ ఆడిటోరియంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు.

దేశ సర్వోతోముఖాభివృద్ధిలో సాంకేతిక రంగం ప్రధానమన్నారు. ఏఐ, ఎంఎల్, స్పేస్ రీసెర్చ్, బయోటెక్నాలజీ రంగాలపై ఫలవంతమైన చర్చలు జరిగాయని అన్నారు. అలాగే మిగతా రంగాల్లోనూ మంచి పరిశోధనలు వచ్చాయని అభినందించారు. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవ సంబురాల వేళ వర్సిటీలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభంగా సదస్సు నిర్వహించడం ప్రత్యేకమని కొనియాడారు. సదస్సుకు అధ్యక్షుడిగా వ్యవహరించిన కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. లర్నింగ్, షేరింగ్, డిస్కషన్స్‌తో పరిశోధనల్లో నాణ్యమైన పురోగతి సాధిస్తామని చెప్పారు. 3 రోజుల కేయూలో ఆరోగ్య పరిరక్షణ, స్పేస్, క్వాంటం వంటి అనేక అంశాల్లో పరిశోధనలపై కీలక చర్చలు జరిగాయని చెప్పారు. భవిష్యత్‌తో వాటి ఫలితాలు వస్తాయని అకాంక్షించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలను వెలువరించాలని అన్నారు. టీసీఎస్-25 జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ సైన్స్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతికి పనిచేస్తోందన్నారు. వర్సిటీలు, పరిశోధనలు, పారిశ్రామిక రంగాలకు అనువర్తనాలుగా సాగాలని అన్నారు.

కేయూ యూజీసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, టీపీసీ, టీఎస్‌సీ-25 చైర్మన్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, టీసీఎస్-25 సెషన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, టీఏఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి, నిట్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సదస్సు ఉద్దేశాలను.. కేయూ సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సదస్సు ఫీడ్‌బ్యాక్‌ను వివరించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రా మిరెడ్డి మూడు రోజుల సదస్సు నివేదికను ప్రవేశపెట్టారు. ఓరల్ ప్రజంటేషన్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఇంజనీరింగ్ విభాగాల డీన్ ప్రొఫెసర్ మంచాల సదానందం, పోస్టర్ ప్రజంటేషన్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనో హర్‌ల నేతృత్వంలో నిర్వహించారు. ముగింపు సదస్సుకు స్వాగతం డాక్టర్ బి.దీపాజ్యోతి పలుకగా సభికులకు కృతజ్ఞతలను కేయూ ఫార్మసీ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ చెప్పారు. అంతకుముందు కేయూ ఆడిటోరియంలో వినూత్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో దేశా నికి వికసిత్ భారత్‌లో ముందుకు తీసుకెళ్లే రూపశిల్పులు అనే ప్యానల్ చర్చ జరిగింది.

ఈ సందర్భంగా టీసీఎస్-25 అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన చర్చలో వక్తలు ప్రొఫెసర్ రాంరెడ్డి, సారంగపాణి, దత్తాలు మాట్లాడుతూ.. దేశంలో యువత ఎక్కువగా ఉందని చెప్పారు. దేశానికి అభివృద్ధిపరంగా ముందుకు తీసుకు పోయేందుకు నూతన ఆవిష్కరణలు అవసరమన్నారు. శాస్త్రీయ, సాంకేతిక మార్పులకు అనుగుణంగా యువత పరిశోధనలు ఉండాలని సూచించారు. జాతీయ విద్య విధా నం-2020లో నైపుణ్య శిక్షణను ప్రోత్సహించే ప్రణాళికలు రూపొందించారని చెప్పారు.

సైన్స్ కాంగ్రెస్ అవార్డుల విజేతలు వీరే..

కేయూలో జరిగిన తెలంగాణ అకాడమీ సైన్స్ కాంగ్రెస్ ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రజంటేషన్ అవార్డు ఫిజికల్ సైన్స్‌లో వెంకటరమణ సాధించారు. అలాగే గణితంలో బెస్ట్ ఓరల్ అభిలాష్, బెస్ట్ పోస్టర్ రాజ్‌కుమార్‌లు సాధించారు. కెమికల్ సైన్స్‌లో బెస్ట్ ఓరల్ నాగరాజు, బెస్ట్ పోస్టర్ విక్రమ్‌లు సాధించారు. ఇంజనీరింగ్, టెక్నాలజీలో బెస్ట్ ఓరల్ సతీశ్‌కుమార్, బెస్ట్ పోస్టర్ పారిన్ ఫాతిమాలు సాధించారు. ఫార్మసీలో బెస్ట్ ఓరల్ శిరీష, బెస్ట్ పోస్టర్ ప్రసాద్‌లు సాధించారు. ఎర్త్ సైసైస్‌లో బెస్ట్ ఓరల్ శ్రీధర్, బెస్ట్ పోస్టర్ సతీశ్‌లు సాధించారు. లైఫ్‌సైన్స్‌లో బెస్ట్ ఓరల్ డాక్టర్ బి.అనేదా, బెస్ట్ పోస్టర్ లక్ష్మీపునీతలు సాధించారు.

ఆసక్తి రేపిన సైన్స్ కాంగ్రెస్ చర్చాగోష్ఠులు

నూతన శాస్త్ర, సాంకేతిక అంశాలపై నిపుణుల ప్రసంగాలు



ప్లీనరీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు రఘురాం, చలపతి, శాస్త్రవేత్త మృత్యుంజయనేయ రెడ్డి



ప్లీనరీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు నారాయణరావు, రాంబాను దేవ్‌రాజ్, సైంటిస్టు విద్యాసాగర్

కేయూ క్యాంపస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ అకాడమీ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, చర్చాగోష్ఠులు మూడో రోజు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా కేయూ ఆడిటోరియంలో 'సైన్స్ లీడ్ ఇన్నోవేషన్ ఫర్ సస్టైన బుల్ న్యూట్రెంట్స్ మేనేజ్‌మెంట్ : ఏ సర్క్యులర్ ఎకానమీ అప్రోచ్' అనే అంశంపై న్యూఢిల్లీ ఇంద్రాప్రస్తా వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.రఘురామ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో ప్రసంగించారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కీలక ప్రతిపాదనలు చేశారు. పంటల తీరు, భూసారం, ప్రభుత్వ విధానాలు, రైతుల స్థితిగతులపై అనేక అంశాలను ప్రస్తావించారు. దేశంలో యూరియా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో దీనికి ప్రత్యామ్నాయ ఎరువులున్నాయని, వాటిని వాడుకోవాలని సూచించారు.

కేరళలోని తిరువనంతపురం ప్రొఫెసర్ వీఎన్ చలపతి 'డైమండ్స్ : ఫ్రం థెయిర్ బర్త్ టూ ఇంటర్నిటీ' అనే అంశంపై ప్రసంగిస్తూ.. ప్రాచీన భారతీయ జ్ఞానం గొప్పదన్నారు. సహజ సిద్ధమైన డైమండ్, కృత్రిమ డైమండ్‌ల మధ్య భేదాన్ని విశ్లేషించారు. భూగోళశాస్త్రంలో అనేక మార్పులున్నాయని పేర్కొన్నారు.

అర్కిటెక్ట్స్ ఆఫ్ ప్రోగ్రామ్ - ఇండియా యూత్ విత్ ఇన్నోవేటివ్ సైన్స్, టెక్నాలజీ ఫర్ ఎ వికసిత్ భారత్ ప్లానల్ డిస్కషన్ ప్రొఫెసర్ ఎ.సదానందం నేతృత్వంలో జరిగింది. ఫిజికల్ సైన్స్ సెమినార్ హాల్‌లో 'హైపర్‌ఫైన్ ఇంట్రాక్షన్స్: టూల్ టూ స్టడీ మ్యాగ్నటిక్స్, ఫెర్రోఎలక్ట్రిక్స్ మెటీరియల్' అనే అంశంపై యూజీసీ డీఏఈ సీఎస్ఆర్ ఇండోర్ ప్రొఫెసర్ వి.రఘువేంద్రరెడ్డి ప్రసంగించారు. అలాగే 'రేడియోలజికల్ ఎనర్జీ అండ్ ప్రీఫరెండెన్సెస్ ఇన్ న్యూక్లీస్ మెడిసిన్' అనే అంశంపై ముంబయి బార్క్ సైంటిస్టు డాక్టర్ డి.విద్యాసాగర్ ప్రసంగించారు. 'డిరిచ్‌లేట్ బౌండరీ అప్టికల్ కంట్రోల్ ప్రాబ్లమ్స్' అనే అంశంపై బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ తిరుపతి గుడి ప్రసంగించారు. విభిన్న సమీకరణలు, ప్రవేశ విలువలు, షరతులు, మానవ శరీరంలోంచి వివరించారు. కెమిస్ట్రీ సెమినార్ హాల్‌లో హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కిశోర్ నట్టే రసాయన, ఔషధ పరిశ్రమలలో ఉపయోగించే ఉత్ప్రేరక సమ్మేళనాల ప్రభావం, పర్యావరణ పరిరక్షణలో పాత్రను విశ్లేషించారు. ప్రొఫెసర్లు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. జువాలజీ సెమినార్ హాల్‌లో 'క్లైమెంట్ రిసిలియంట్ ఇంటిగ్రేటెడ్ వెబ్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై ఐసీఆర్ఐఎస్ఏటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఎ. నారాయణరావు ప్రసంగించారు. పంటల్లో కలుపు నివారణకు సాంకేతిక పద్ధతులను అవలంబించాలని చెప్పారు.

కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో 'స్పేస్ టెక్నాలజీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జీపీ బిర్లా ఇన్స్టిట్యూట్ శాస్త్రవేత్త డాక్టర్ కె.మృత్యుంజయనేయరెడ్డి ప్రసంగించారు. స్పేస్ టెక్నాలజీలో ఇటీవల చోటు చేసుకున్న మార్పులను వివరించారు. 'సూరోగేట్స్ అండ్ అప్రోచ్‌మేషన్స్ ఫర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు ప్రసంగించారు. ఇంజనీరింగ్, టెక్నాలజీలో వస్తున్న నూతన మార్పులపై అధ్యయనం చేసి వినూత్న ఆలోచనలు చేయాలన్నారు. ఫార్మసీ సెమినార్ హాల్‌లో 'ఫ్యూరిస్టిక్ మెడిసిన్: ఎక్స్‌పెక్టేషన్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్స్ డిస్కవరీ' అనే అంశంపై పూణేలోని పల్స్ ఫార్మసిటికల్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ రాంబాను దేవ్‌రాజ్ ప్రసంగించారు. ఫార్మసీ మీని సెమినార్ హాల్‌లో 'పెట్రోజెనిక్ ఎవల్యూవేషన్ ఆఫ్ నీయోచరమ్ హైదరాబాద్ బాతోలిత్' అనే అంశంపై హైదరాబాద్ సీఎస్ఆర్ -ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త రాం బహు ప్రసంగించారు. క్యాన్సర్ నివారణకు ఇటీవల విడుదలైన ఔషధాలు నూతన పుంతలు తొక్కుతున్నాయని మంచి రిజల్ట్ వస్తోందని పేర్కొన్నారు.

వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించాలి

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి ఎంపీ కావ్య వినతి

హనుమకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఇప్పటికే ఆమోదం పొందిన సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను త్వరితగతిన ప్రారంభించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. ఎంపీ కావ్య గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డాను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌లో వేలాదిమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు ఉన్నారని, వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ సౌకర్యం లేకపోవడం వల్ల వారు హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తోందని తెలిపారు.

దీంతో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ సెంటర్‌కు ఆమోదం తెలిపిందని, కానీ ఇంకా ప్రారంభం కానందువల్ల ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే వరంగల్ సీజీహెచ్‌ఎస్‌లో వైద్యసిబ్బంది నియామకం చేపట్టి, శాశ్వత భవనం కేటాయించి సెంటర్‌ను ప్రారంభించాలని ఎంపీ కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి ఇందుకు సానుకూలంగా స్పందించారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు, వ్యాపారావకాశాల మెరుగుకు అవసరమైన ఇన్నోవేషన్ కోసం ఇంక్యుబేషన్ సెంటర్ లేకపోవడంపై వరంగల్ ఎంపీ కడియం కావ్య నిరాశ వ్యక్తం చేశారు. వరంగల్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ యువత, ముఖ్యంగా ఎస్‌సీ యువతీ, యువకులకు వ్యాపారావకాశాలు కల్పించాలని కావ్య కోరారు. గురువారం ఎంపీ ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. ఈ ప్రశ్నకు కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే స్పందించారు. ప్రధాని ముద్రా యోజన (పీఎంఎంవై) పథకం ద్వారా వడ్డీ లేకుండా రూ.20లక్షల వరకు రుణాలు లభ్యమవుతున్నాయని లిఖిత పూర్వకంగా తెలిపారు.

పదోన్నతుల పర్వం

ఉమ్మడి జిల్లాలో

145 మందికి హెచ్‌ఎంలుగా ప్రమోషన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ పరిధిలోని 19 జిల్లాల్లో మొత్తం 492 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు.. పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 145 మందికి లబ్ధి చేకూరింది. పదోన్నతులపై స్టేను బుధవారం హైకోర్టు తొలగించడంతో గతంలో నిలిపివేసిన అప్షన్ల ఎంపికకు గురువారం అవకాశం ఇచ్చారు. దీంతో ప్రభుత్వ యాజమాన్యంలో 54 మంది హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందగా, లోకల్‌బాడీ యాజమాన్యాల్లో 438 మంది హెడ్మాస్టర్లుగా పదోన్నతులు సాధించారు. వరంగల్ జిల్లాలో 37 మంది, హనుమకొండలో 80, జనగామలో 11, ములుగులో 3, జయశంకర్ భూపాలపల్లిలో 2, మహబూబాబాద్ జిల్లాలో 12 మంది హెడ్మాస్టర్లుగా పదోన్నతులు సాధించారు. పదోన్నతి పొందిన వారు శుక్రవారం కొత్త స్థానాల్లో చేరనున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీబీసీ సంఘం బాధ్యులు

క్రైస్తవ మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవు

- మద్రాసు హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది..
- ఆస్తులపై ఏబీఎఫ్ఎంఎస్‌కు ఎలాంటి హక్కులు లేవు
- కోర్టు తీర్పుతో చట్టపరంగా ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం..
- హనుమకొండ సీబీసీ సంఘం అధ్యక్షుడు టి.విజయ్ స్వరూప్

హనుమకొండ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమంగా జరిగిన క్రైస్తవ మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవని హనుమకొండ సెంటినరీ బాపిస్టు చర్చి సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి విజయ్ స్వరూప్ వెల్లడించారు. మద్రాసు హైకోర్టు ఈ మేరకు స్పష్టమైన తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. డిసెంబర్ 19, 2024, సీఎస్ నెం.124/1994 ప్రకారం మద్రాసు హై కోర్టు తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని మిషన్ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో న్యాయవాదులు ఎన్.క్రిష్ణకుమార్, పి.రామ్‌గోపాల్‌రావు, డి.అనిల్‌రాజ్, డి.సునిల్‌రాజ్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. కోర్టు ప్రకటించిన తీర్పు ప్రకారంగా 1979నుంచి అక్రమ మార్గాల్లో విక్రయించిన ఆస్తు లు చెల్లవని పునరుద్ఘాటించారు. తీర్పు ఆధారంగా అన్యాక్రాంతమైన హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చితో పాటు రాష్ట్రంలోని అన్ని మిషనరీ ఆస్తుల పరిరక్షణకు బలం ఏర్పడిందన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకునే అవకాశం దక్కిందన్నారు. బ్రిటీష్ కాలంలో అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ దక్షిణ భారతదేశంలో సేవా కార్యక్రమాల నిమిత్తం ఆస్తులను సమకూర్చుకుందన్నారు. ఆపై సేవా కార్యక్రమాల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పీఏబీసీ, ఎస్‌టీబీసీ సంస్థలకు అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ అప్పగించిందన్నారు. అయితే పీఏబీసీ, ఎస్‌టీబీసీ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేదని తెలిపారు. ఆస్తులను పరిరక్షించాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా అక్రమంగా విక్రయాలు జరిపాయని ఆరోపించారు. ఈ క్రమంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వేల కోట్ల మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతం అయినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆస్తుల పరిరక్షణలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారం మరువలేనిదని స్వరూప్ చెప్పారు. తొలి నుంచి ఆయన సీబీసీ సంఘానికే కాకుండా అన్ని క్రైస్తవ సంఘాలకు రక్షణగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే సహకారంతోనే ఆస్తులను కాపాడుకుంటున్నట్లు చెప్పారు. హనుమకొండ సీబీసీ డాక్టర్ టి. క్రిష్టఫర్, కోశాధికారి విల్సన్ వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.జాన్సన్ ప్రసాద్, జె.డానియేల్, జాయింట్ సెక్రెటరీ కె.విద్యాకర్, ఎన్.సునీల్‌కుమార్‌తో పాటు జనగామ, నల్లగొండ. హనుమకొండ ఫీల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు కేఎం జాన్, టీఎస్ క్రిష్టఫర్, మార్టిన్ లూథర్ తదితర క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం జరిగింది..

ఆస్తుల విక్రయాలు జరుగుతున్న సమయంలో పీఏబీసీ తీరును ఖండిస్తూ క్రైస్తవ సంఘ ప్రతినిధులు మద్రాసు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పోరాటం అనంతరం తమ న్యాయ పోరాటం ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పీఏబీసీ, ఎస్‌టీబీసీ అమ్మిన ఆస్తులు చెల్లవని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో 1979 నుంచి 2000 వరకు జరిగిన మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవని, వాటిని స్వాధీనం చేసుకునే అధికారం దక్కినట్లు వివరించారు. ఇదే క్రమంలో పీఏబీసీ సంస్థను ట్రస్టీషిప్ నుంచి తొలగించడం జరిగినట్లు తెలిపారు. అదేవిధంగా ఆస్తులపై ఏబీఎఫ్ఎంఎస్‌కి కూడా విక్రయ అధికారాలు లేవని వెల్లడించారు. ఇక కొత్త ట్రస్టీని ఎన్నుకునేందుకు కోర్టు తీర్పు అవకాశం కల్పించిందన్నారు. దేవుడి దయతో ఆస్తుల పరిరక్షణకు తీర్పు రావడంతో ఇక మిగిలిన ప్రక్రియ పూర్తిపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

ప్రదీప్‌రావు ప్యానెల్ క్లీన్‌స్వీప్

- రసవత్తరంగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు
- మొత్తం ఓట్లు 6,368... పోలైన ఓట్లు 2,437



ఓటు వేసేందుకు వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, ప్రదీప్‌రావు తదితరులు

వరంగల్ సిటీ/మట్టెవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్యానెల్ ఘన విజయం సాధించింది. నగరంలోని ఎస్‌వీఎన్ రోడ్‌లో గల ఏవీవీ కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 6,368 ఓట్లకు గాను 2,437 ఓట్లు పోలయ్యాయి. చెల్లిన ఓట్లు 2,082, చెల్లని ఓట్లు 355 ఉన్నాయి. దీంతో 39.34 శాతం పోలైనట్లు ఎన్నికల అధికారి వాల్యా నాయక్ తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, మేధావులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, హస్తకళల బోర్డు మాజీ చైర్మన్ బొల్లం సంపత్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి తదితరులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గత 25 ఏళ్లుగా అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కొనసాగుతున్న ప్రదీప్‌రావు ప్యానెల్‌కే ఓటర్లు జైకొట్టారు. రాజకీయాలు పక్కనపెట్టి ప్రదీప్‌రావుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మద్దతు తెలిపారు. సీక్రెట్ ఓటింగ్ కావడంతో ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం ప్రదీప్‌రావుకు, ఆయన ప్యానెల్ అభ్యర్థులకే ఓటు వేసి వారి గెలుపునకు దోహదపడ్డారు. కాగా, ఎన్నికలలో ఎలాంటి గొడవలు జరగకుండా వరంగల్ ఏసీపీ శుభం ప్రకాష్ ముందస్తు చర్యల్లో భాగంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటింగ్ కోసం లోపలికి వెళ్లే వ్యక్తుల గుర్తింపు కార్డులను పరిశీలించి పంపారు. దీంతో ఎక్కడా ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు సజావుగా సాగాయి.

బ్యాంకు సేవలను రాష్ట్రం మొత్తం విస్తరిస్తాం..

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరంగల్ అర్బన్ బ్యాంక్ శాఖలను విస్తరిస్తామన్నారు. అర్బన్ బ్యాంక్ అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంతమంది బురద చల్లే ప్రయత్నం చేశారని, ఈ గెలుపుతో వారికి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. తాను ఒక రాజకీయ పార్టీకి చెందిన వాడినైనప్పటికీ తమ ప్యానెల్‌కు అన్ని వర్గాలు, పార్టీల వారు పూర్తి మద్దతును తెలిపారని, వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. నష్టాల్లో ఉన్న బ్యాంక్‌ను లాభాల బాటలో నడిపించామని, ప్రస్తుతం రూ.400 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుందన్నారు. కాగా, ప్రదీప్‌రావు, ఆయన ప్యానెల్ సభ్యులందరు గెలుపొందడంతో రంగులు పూసుకున్నారు. స్వీట్లు పంచి, టపాసులు కాల్చి అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్యానెల్ క్లీన్ స్వీప్ చేసింది. ప్యానెల్‌లోని 12 మంది అభ్యర్థులు గెలుపొందారు. మిగతా 13 మంది అభ్యర్థులు ఓటమి పాలయ్యారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలాగే సంఘం ఆఫీస్ బేరర్స్ ఎన్నిక నిమిత్తం ఎన్నికైన పాలకవర్గ సభ్యుల సమావేశం శుక్రవారం(తేది.22-8-2025) ఉదయం 9 గంటలకు కాశిబుగ్గ ఓసిటీ రోడ్‌లోని వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం జరిగింది. పాలకవర్గ సభ్యులందరు నిర్ణీత తేది, సమయానికి హాజరుకావాలని ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి వాల్యా నాయక్

విజేతలు - పోలైన ఓట్లు

1. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (2166)
2. నీలం మల్లేశం(1992)
3. చకిలం ఉపేందర్ (1987)
4. తోట జగన్నాథం (1976)
5. కూరపాటి చంద్రమౌళి (1887)
6. మంద స్వప్న (1804)
7. ఐనవోలు వెంకట సత్యమోహన్ (1801)
8. వొడ్నాల సదానందం (1709)
9. ముందాడ వేణుగోపాల్ (1661)
10. బానోతు సీతామహాలక్ష్మి (1576)
11. మహ్మద్ సర్వర్ అహ్మద్ పాషా (1281)
12. పత్తి క్రిష్ణ (1461)

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

హనుమకొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మామునూరు ఎయిర్ పోర్టు భూ సేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపులు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, భద్రకాళి చెరువు పూడికతీత పనులు, ఇన్నర్ రింగు రోడ్డు, వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి వాటి వివరాలను వివరించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. వరంగల్ ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసి టెండర్ పనులు ప్రారంభించాలన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు భూ సేకరణకు రూ.205కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.4170కోట్లతో వరంగల్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, దశల వారిగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. కాకతీయుల కాలం నాటి దేవాలయాలు నిరాదరణకు గురయ్యాయని, పూర్వ వైభవం కోసం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు పురోగతిపై మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సాగునీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాంప్రసాద్, కుడా సీఈఓ అజిత్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'నానో యూరియాను ఉపయోగించాలి'

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల



పొగుళ్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న విజయనిర్మల

కొత్తగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బస్తాల కోసం ఎదురు చూడకుండా రైతులు నానో యూరియాను ఉపయోగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల సూచించారు. పొగుళ్లపల్లి, ఓటాయి గ్రామాలలో డీఏవో గురువారం పర్యటించారు. పొగుళ్లపల్లిలోని సొసైటీని పరిశీలించారు. సొసైటీ వద్ద ఉన్న రైతులతో మాట్లాడి, నానో యూరియా ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఓటాయిలోని మహలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌ను తనిఖీ చేశారు. యూరియా బస్తాల పంపిణీని పరిశీలించారు. రిజిష్టర్‌లను పరిశీలించారు. ఏవో ఉదయ్, ఏఈవోలు వినోద్, అరవింద్, జశ్వంత్ పాల్గొన్నారు.

యూరియా బ్లాక్‌లో అమ్మవద్దు

● గంగారం : యూరియా బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు తప్పవని స్థానిక వ్యవసాయశాఖ అధికారి వేణు హెచ్చరించారు. స్థానిక రైతు వేదికలో తహసీల్దార్ బాలకిషన్ అధ్యక్షతన జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్సులు కలిగిఉన్న ప్రతి డీలరుకు వచ్చే యూరియా నిల్వలను వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలోనే విక్రయించాలని సూచించారు. ఎస్ఐ రవికుమార్, ఏఈవోలు ధరనీష్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఎరువుల షాపుల తనిఖీ

● డోర్నకల్ : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్ ఆకస్మికంగా పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. షాపుల్లో రసీదులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తనిఖీ చేసిన శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్, శ్రీవీరవెంకట సత్యనారాయణ ట్రేడర్స్‌లను ఏఈవోల పర్యవేక్షణలో యూరియా అమ్మకాలు కొనసాగించారు. తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఏవో మురళీమోహన్, ఏఈవోలు పాల్గొన్నారు.

యూరియా బస్తాలు అందించాలి

● మాజీమంత్రి రెడ్యానాయక్

కురవి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ యూరియా బస్తాలు అందించాలని మాజీమంత్రి డీఎస్ రెడ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవిలోని ఆంధ్రాబ్యాంక్ సొసైటీలో యూరియా కోసం క్యూలైన్‌లో ఉన్న రైతులను కలిసి మాట్లాడారు. యూరియా అవసరం ఉందని తెలిసి ముందుగా ఎందుకు తెప్పించలేదని అధికారులను ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో యూరియా కోసం ఏ ఒక్కరైతు రోడ్డెక్కలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని ప్రతి రైతుకు యూరియా అందించాలన్నారు. రెడ్యా వెంట నామ సైదులు, రాంలాల్ పాల్గొన్నారు.

పన్నుల విషయంలో మోదీ నోరు విప్పాలి

● దేశంలో పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం ● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సుంకరి వీరయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై అధిక పన్నులు వేస్తామని మాట్లాడుతుంటే.. ఈ విషయంలో ప్రధాని మోదీ నోరు విప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సుంకరి వీరయ్య కోరారు. భారత్‌పై భారాలు మోపుతానని ట్రంప్ బెదిరిస్తున్న ప్రధాని స్పందించకపోవడం శోచనీయమన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం రాత్రి సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకుని 'రాజ్యాంగ విలువలు ట్రంప్ టారిఫ్ దాడి కేంద్రప్రభుత్వ వైఖరి' అనే అంశంపై సెమినార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ట్రంప్ గెలుపు కోసం దేశ ప్రధాని మోదీ అమెరికా వెళ్లి ప్రచారం చేశారని చెప్పారు. బీహార్ రాష్ట్రంలో మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనుండగా ఎన్నికల కమిషన్ చేర్పులు మార్పుల పేరుతో 65 లక్షల ఓట్లను తొలగించిందని పేర్కొన్నారు. ఎర్రకోట సాక్షిగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున అమరవీరులను అవమానించేలా ప్రధాని మోదీ మాట్లాడారని చెప్పారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన సీతారాం ఏచూరి

సీతారాం ఏచూరి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసినంత కాలం మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య లౌకిక విలువల కోసం, రాజ్యాంగం పునాది కోసం పని చేశారని వీరయ్య అన్నారు. దేశంలో రోజురోజుకు సమస్యలు పెరిగిపోతున్నాయని అనేక సమస్యలపై చర్చ జరగడం లేదని చెప్పారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాలకులు సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా కార్పొరేట్లకు ఉపయోగపడే విధంగా పని చేస్తున్నారని విమర్శించారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

రాబోయే రోజుల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, ఆకుల రాజు, అల్వాల వీరయ్య , కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నర్సింహులపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా బాధ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు.గురువారం మండల కేంద్రంలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.. ఈ నెల 23న హైదరాబాద్‌లని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను ఉపాధ్యా యులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు క్రాంతికుమార్,వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను చేపట్టాలి

దంతాలపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి)మండలంలో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని గురువారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అధికారు లను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఎంపీవో మహ్మద్ అప్సరపాషకు పలు అంశాలతో కూడిన వినతి పత్రంను అందించారు. కార్యక్రమంలో నాయకులు ఊడుగుల రాములు, సెగ్గెం యాకయ్య, పీవైఎల్ నాయకులు శ్రీనివాస్, వెంకన్న, రమేష్, పీవోడబ్ల్యూ నాయకురాలు సునీత పాల్గొన్నారు.

'న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి'

తొర్రూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్‌లకు కోర్టులు అందిస్తున్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ మండల న్యాయ సేవా సంస్థ, తొర్రూరు కోర్టు జడ్జి ధీరజ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ సీనియర్ సిటిజన్ దినోత్సవ సందర్భంగా లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 2007 సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం ప్రతీ ఒక్కరికి హెల్త్ కార్డులు, పోస్టాఫీసు, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. సీనియర్ సిటిజన్‌లను వారి పిల్లలు, కుటుంబ సభ్యులు పట్టించుకోకపోతే ప్రభుత్వం వృద్ధాశ్రమాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సెక్రటరీ అశోక్, సీనియర్ సిటిజన్‌లు రాజలింగం, విశ్వనాథచారి, జి. నర్సయ్య, రాంబాబు, ఎస్సై అంజమ్మ ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

తొర్రూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాలతో పాటు మునిసిపాలిటీల్లో పారిశుధ్య పనులు పడకేశాయని, వెంటనే పనులు చేపట్టాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వీరన్న అన్నారు. గురువారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

పెద్దవంగర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. గురువారం మండలంలోని వడ్డెకొత్తపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను, ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. ప్రతీ ఒక్కరు వ్యకిగత పరిశుభ్రతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్ఎం శేషవల్లి, పంచాయతీ కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

'బడుల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి'

నర్సింహులపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో రాధిక, ఎంఈవో రాంమ్మోహన్‌రావులు అన్నారు. గురువారం మండలంలోని బోడ్కతండా ప్రాథమికోన్నత పాఠశాలలో తొర్రూరు టీచర్స్ లయన్స్ క్లబ్, ఉపాధ్యయ బృందం సహకారంతో 10వేల విలువగల బ్యాగులు, టై బెల్టులు విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, టీచర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎద్దు వెంకన్న, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, వినోద్ కుమార్, సీఆర్‌పీ శేషుకుమార్, బానోతు తిజోరి, సునీత పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలను బంగారు మైసమ్మతల్లి గుడికి తీసుకెళ్తున్న మహిళలు

మరిపెడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బంగ్లా బంగారు మైసమ్మతల్లి బోనాల పండుగను గురువారం మార్కెట్ కూరగాయల వ్యాపారులు ఘనంగా నిర్వహించారు. శివసత్తులు పలు విధాల పన్నివేశాలతో హోరెత్తించారు. మార్కెట్ మహిళలందరు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. డప్పుచప్పుళ్లతో డీజే డ్యాన్స్‌లతో ఆలరించారు. బంగారు మైసమ్మకు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించారు. జంతు బలులు ఇచ్చి చల్లంగ చూడాలని ఆ తల్లికి మొక్కుకున్నారు. మార్కెట్ మహిళలు జయమ్మ, మీరాబీ, సైదమ్మ, పద్మ, సుశీల, శోభ, ఉమ, రామతార, యాకుబ్, రాజు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

(5వ పేజీ తరువాయి)

రైతులు బారులు తీరారు. కేవలం 444 యూరియా బ్యాగులు అందుబాటులో ఉండగా, దాదాపు 1200 మందికి పైగా రైతులు యూరియా బస్తాల కోసం వచ్చారు. ఆ తర్వాత రైతులకు కూపన్లు అందించారు. ప్రస్తుతం 444 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రేపు మరోలోడ్ వస్తుందని ఏవో నర్సింహారావు తెలిపారు.

ఎకరానికి బస్తా అందచేత..

● చిన్నగూడూరు : మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. చిన్నగూడూరులో నిల్వలు లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించడంతో ఉత్పత్తులను కొనాలని రైతులపై భారం మోపుతున్నారు. మొక్కజొన్న, వరి, పత్తి పంటలకు యూరియా అత్యవసరం కావటంతో సరిపడా బస్తాలు దొరక్కపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. జయ్యారం రైతు వేదికలో గురువారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీసుఅధికారుల పర్యవేక్షణలో ఎకరానికి ఒక్కో బస్తా చొప్పున 232బస్తాలు పంపిణీ చేశారు. కాగా, కొంత మంది రైతులు యూరియా బస్తాలు దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

సొసైటీ కార్యాలయంలో రైతుల పాట్లు

● గార్ల : మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. అధికారులు వచ్చి కూపన్లు ఇచ్చే సమయంలో పెద్ద ఎత్తున ఘర్షణలు తలెత్తడంతో గార్ల, బయ్యారం, డోర్నకల్ సీఐలు రవికుమార్, రాజేష్ నేతృత్వంలో పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో, కృష్ణవేణి, తహసీల్దార్ శారద, ఏవో రామారావు సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కార్యాలయానికి చేరుకొని రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి వస్తుందని, ఎవరు ఇబ్బంది పడవద్దని భరోసా కల్పించారు.

అధికారుల సమక్షంలో బస్తాల పంపిణీ

● బయ్యారం : గంధంపల్లిలోని శ్రీదివ్య ఫర్టిలైజర్ షాపుకు లారీ యూరియా రాగా రైతులు గుమ్మిగూడారు. దీంతో తహసీల్దార్ నాగరాజు, ఎస్సై తిరుపతితో పాటు మండల వ్యవసాయ అధికారుల సమక్షంలో యూరియాను పంపిణీ చేశారు. యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీవో క్రిష్ణవేణి పరిశీలించారు. కాగా, శ్రీ దివ్య ఫర్టిలేజర్‌కు యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు వేకువజాము నుంచే షాపు వద్ద పడిగాపులు కాశారు.



కురవిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

'అంటువ్యాధులు రాకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలి'

గంగారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, వైద్య క్యాంపులు నిర్వహించాలని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) డాక్టర్ వరుణ్‌విజయ్, డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. గురువారం గంగారం పీహెచ్‌సీ లో రికార్డులు, పారిశుధ్య పనులు పరిశీలించారు. దీర్ఘకాలిక రోగాల పట్ల సమీక్ష నిర్వహించారు. అనంతరం సబ్ సెంటర్ పరిధిలో ఇంటింటికి తిరిగి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్‌విజయ్ మాట్లాడుతూ క్షయ, కుష్టు, మలేరియా, డెంగూ, బోదకాలు వ్యాధులు ప్రబలకుండా వైద్య క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సూర్యం, డీపీవో నీలోహన, హెచ్‌వీ మరియారాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలని వినతి

బయ్యారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేరుకపోయిన చెత్తను తొలగించేలా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ.. గురువారం ఎంపీడీవో విజయలక్ష్మీకి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. వర్షాకాలంలో విజృంభించే కీటకనాసితో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గ్రామాల్లో పేరుకపోయిన చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, పూర్ణ, శ్రీను, కృష్ణ, జానీ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ)ల ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని నాయకులు మల్లారెడ్డి, కవితలు పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నిర్వహించనున్న ధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, 19 నెలలు పూర్తికావస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లనే ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, బలాష్టి రమేష్, శ్రీశైలం, షైన శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, రాచకొండ ఉపేందర్, హరినాయక్, రాజశేఖర్, రామలింగారెడ్డి, విజయ్‌కుమార్, సజ్జనము విద్యాసాగర్, యాకయ్య, ప్రవీణ్‌కుమార్, సంజీవ, కృష్ణమూర్తి, మంజుల, జబర్‌లాల్, వీరభద్రం, సోమేశ్వర్, మంగీలాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

● ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టి పూజించాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, క్లైమెట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతిష్ఠించే విగ్రహాలను మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని, వివిధ రకాల రంగులతో ఏర్పాటు చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేయడం వలన పర్యావరణం కలుషితమవుతుందన్నారు. మట్టివినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని నవరాత్రుల అనంతరం నిమజ్జనం చేయడం వలన పర్యావరణానికి ఎలాంటి నష్టం కలుగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, ఉపేందర్, వీరు, సుమలత, సంతోష్‌కుమార్, రవితేజ, ఉదయ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

ధర్నాను సక్సెస్ చేయాలి : యూఎస్‌పీసీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఈనెల 23న నిర్వహించనున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) మహాధర్నాను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాస్కర్, దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సీపీఎస్‌ను రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య, ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం, 317 జీవో బాధితుల సమస్యలు పరిష్కరిస్తామనే హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

కేసముద్రంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అదృశ్యం

కేసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొత్త సునీత్ (25) గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి కనిపించకుండా పోయినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. మూడేళ్ల నుంచి బెంగళూరుకు చెందిన ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ రంగంలో వర్క్‌ఫ్రం హోం విధానంలో పనిచేస్తున్న సునీత్ సాయంత్రం ఇంట్లోంచి బైక్ వేసుకొని కేసముద్రం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం వద్ద పెట్టి సెల్ స్విచ్ఆఫ్ చేసినట్లు తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాస్‌పుస్తకాలు అడిగితే బైండోవర్ చేశారు

● మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి

కేసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం రైతులు ఆందోళనలు నిర్వహిస్తే తనను ప్రభుత్వం బైండోవర్ చేసిందని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి ఆరోపించారు. కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం ఎనిమిదేళ్లుగా రైతులతో కలిసి శాంతియుత ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా రైతునైన తనను బైండోవర్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా తమ గ్రామానికి ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

24న జిల్లాస్థాయి యోగా పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 24న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తూణం పుష్పలీల, నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికలకు ట్రెడిషన్ బ్యాక్ బెండు, పార్వర్డ్‌బెండ్, టెస్టింగ్ హ్యాండ్ బాలెన్స్, లెగ్ బ్యాలెన్స్, ఆర్టిస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 8 గంటలకు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 89197 03008, 99851 85287ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ జట్టుకు మైనార్టీ గురుకుల విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బీహర్ రాష్ట్రంలోని బోద గయలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగే సబ్ జూనియర్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు అశ్వసాయితేజ, ఉమేష్, యశ్వంత్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీహర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టులో పాల్గొనే పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం పొందిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు నసీరుద్దీన్, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య, జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి అభినందించారు.

హెల్త్‌క్యాంపులను ఏర్పాటు చేయాలి

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో దోమల వ్యాప్తితో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో గురువారం ఎంసీపీఐ (యూ) మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) మండల నాయకులు వీరస్వామి, బుచ్చిరామయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 28వవార్డు పరిధి హన్మంతుని గడ్డ బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ తెలిపారు. హన్మంతుని గడ్డలో గురువారం బూత్ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిటీని ఎన్నుకున్నారు. బూత్ అధ్యక్షురాలిగా లక్ష్మి ప్రియాంక, ఉపాధ్యక్షులుగా తాళ్ల సతీష్, కార్యదర్శిగా బోయిన స్వాతిలను ఎన్నుకున్నట్లు చెప్పారు అనంతరం అధ్యక్షురాలిగా ఎన్నికైన లక్ష్మి ప్రియాంకను సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాముపల్ శ్యాంసుందర్‌శర్మ, నరేష్, రవి, సుదాకర్, శ్రీనివాస్, లింగన్న, రమేష్, స్వరూప, రజిత, శ్రీలత, వెంకటేష్, సునిత పాల్గొన్నారు.

డెంగీతో చిన్నారి మృతి



సాత్విక(ఫైల్)

తొర్రూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డెంగీ జ్వరంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ తొమ్మిదేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మా రపు బుచ్చిమల్లు-కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, చిన్న కుమార్తె ధర్మారపు సాత్విక (9) గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించిన కుటుంబసభ్యులు పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సలహామేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచన చేయాలి

● సీఐ సూర్యప్రకాష్



మాట్లాడుతున్న సీఐ సూర్యప్రకాష్

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఆలోచన చేయాలని గూడూరు సీఐ సూర్యప్రకాష్ అన్నారు. గూడూరు మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే గురుకులంలో గురువారం విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక సమాజంలో మూఢనమ్మకాలను విశ్వసించకుండ శాస్త్రీయపరంగా ఆలోచన చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.